# పి. యు. సి. ప్రేమ

ఈమధ్య ఒక కథ చదువుతూంటే నాకు వోడ్‌హౌస్ జ్ఞాపకంవచ్చాడు. ముఖ్యంగా వోడ్‌హౌస్ నవలలో ఒక ఘట్టం జ్ఞప్తికి వచ్చింది.

నాలాంటి వాళ్ళు నలుగురు స్నేహితులు ఉన్నారు. నిర్భాగ్య దామోదరులు. బతకడానికి డబ్బు అవసరం అయింది వాళ్ళకి. సంపాదించే మార్గాలు లేవు. అడిగితే ఇచ్చే దాతలు లేరు. బిచ్చమెత్తుకొనడానికి అభిమానం అడ్డువస్తుంది. దాన్ని చంపుకోలేరు. తాము చావలేరు. బతకాలి. బుర్రలు బద్దలు కొట్టుకున్నారు. చివరికి వాళ్ళలో ఒకడికి ఒక గొప్ప ఉపాయం తట్టింది. స్నేహితులతో చెప్పాడు. వాళ్ళు అభినందించారు. ఆనందించారు. నోబెల్ బహుమతి లాంటి దేదో ఇవ్వాలని కూడా అనిపించి ఉంటుంది. అనుమానంలేదు.

ఆ ఉపాయం ఏమంటే — వాళ్ళలో ఒకరు కారుకింద పడాలి. దెబ్బలు తగులుతాయి కదా? అందుకు నష్టపరిహారం లభిస్తుంది. దాన్ని అందరూ పంచుకుని హాయిగా బతకవచ్చు.

అయితే నలుగురిలో ఎవరు కారుకింద పడాలన్నది తెగలేదు. లాటరీ వేశారు. ఒకడి పేరు వచ్చింది.

"పేరు వస్తే వచ్చింది; చస్తాను; నేను కారుకింద పడను" అని మొరాయించాడు వాడు.

"కాదు, నలుగురి క్షేమమూ కోరి నువ్వు కారుకింద పడాలిరా, తండ్రీ! ఇది ఎంత ఉత్కృష్టమైన కార్యమో అర్థం చేసుకోరా! పేరు తెచ్చుకో! నీ కీర్తి చిరస్థాయిగా నిలిచిపోతుందిరా! పడరా, కారుక్రింద పడరా, బాబూ!" అని తలొమ్మా వాళ్ళు ఎంతో హితవు చెప్పారు. వాడుమాత్రం ససేమిరా ఒప్పుకోలేదు. అదీ ఆ ఘట్టం.

ఇది జ్ఞాపకం వచ్చి ఆ ఆనందం పంచుకోవాలని ఒక మిత్రుడితో చెప్పాను. ఆయన, "ఇంకా వోడ్‌హౌస్ బతికి ఉన్నాడా?" అని ప్రశ్నించాడు.

కుదేలయ్యాను. వోడ్‌హౌస్ బతికి ఉన్నాడా?

నే నీమధ్య పత్రికల్లో వోడ్‌హౌస్ గురించి చదవలేదు. వినలేదు.

ఆయన రచనలు బతికే ఉన్నాయి కదా? ఇంతకీ నేను చదివిన కథ చాలా పెద్ద కథ. నవలేమోకూడాను. కాలం మారింది; మనుషులేమో మారలేదు అని కాబోలు దాని సారాంశం. అది అంతగా గుర్తులేదు నాకు. ఎవరికైనా అన్నీ గుర్తు ఉండవు. మనస్తత్వశాస్త్రజ్ఞులేమో — మరిచిపోవడం అనంభవ మంటారు. కావచ్చు. కాని, నేను చాలా చాలా మరిచిపోతుంటాను.

ఏమైనా మనుషులు మారలేదంటే మాత్రం నేను ఒప్పుకోను. చాలా చాలా మారిపోయారు.

కాదనేవాళ్ళకోసం ఒక కథ చెబుతాను, వినండి.

అవి నేను పి. యు. సి. చదివే రోజులు. మా క్లాసులో ఆరుగురు అమ్మాయిలు ఉండేవారు. అందరూ అందమైనవాళ్ళే. అందరిలోకి అందమైన అమ్మాయి అరుణ. అరుణను నేను ప్రేమించకుండా ఉండలేకపోయాను. ప్రేమించాను. అరుణ కూడా నన్ను ప్రేమించింది. మా హృదయాలు ఒకటయ్యాయి. మనసులు కలిశాయి. పెళ్లి చేసుకోవాలని నిశ్చయించాము. మా నిర్ణయానికి తిరుగు లేదు. లోకమంతా ఒకటి అయినా మమ్మల్ని వేరు చెయ్యలేదు. నిజానికి లోకం ఇంకా అప్పటికి అలాంటి ప్రయత్నం ప్రారంభించలేదు. దీనికి కారణం ఉంది. లోకానికికాని, ఆఖరికి మా తలిదండ్రులకి కాని మా ప్రేమగురించి అప్పటికి తెలియదు.

( ఇదొక మార్పు. పూర్వకాలంలో అయితే సాధారణంగా చదువు అయిన తరవాతనో, లేకపోతే పెళ్లి అయిన తరవాతనో ప్రేమించుకోవడం మొదలు పెట్టేవారు. ఈ కాలంలో పి. యు. సి. ప్రేమ సత్యం. ఇంకా చెప్పాలంటే తొమ్మిదవ తరగతిలోనే ప్రేమ పాఠాలు వల్లించడం ఇప్పుడు ప్రారంభం అవుతూంది. )

మా ప్రేమ ఫలిస్తుందని అరుణ, నేను నమ్మామంటే అతిశయోక్తి అణుమాత్రం కూడా లేదు. కాని అనుకోకుండా రెండు అవాంతరాలు సంభవించాయి. మా ప్రేమ పుడిగుండంలో పడింది. మా జీవితాలు తలకిందులయ్యే ప్రమాదం సంభవించింది. మా మనసులు వికలా లయ్యాయి. మా హృదయాలు కుమిలిపోయాయి. మా శరీరాలు బీర్ణాలయ్యాయి.

ఏమంటే — ప్రేమలో పడ్డ అరుణా, నేనూ కూడా పి. యు. సి. పరీక్షలో తప్పాము.

అరుణా వాళ్ళ నాన్న — వట్టి రాక్షసుడు, దుర్మార్గుడు, క్రూరుడు, కఠినుడు, కుమార్తె జీవితాన్ని కష్టాంపాలుజేయడానికి సందేహించని పాషాణ హృదయుడు, హృదయం లేని వాడు — కూతురు చదువు అంతటితో నిలిపివేశాడు.

అరుణ, నేను ప్రేమించుకున్న సంగతి తెలుసుకొన్నాడు. 'పి. యు. సి. కూడా పాసవని చవటకి — అంటే నేనన్న మాట — నా కూతుర్ని చచ్చినా ఇవ్వను' అని శపథం వేశాడు.

ఒక సంబంధం చూశాడు. అరుణ నచ్చిందన్నాడు ఆ కాబోయే పెళ్లికొడుకు. అరుణ నచ్చని చవట ఎవడు? తాంబూలాలు తీసుకొన్నారు. ముహూర్తం నిశ్చయమైంది.

'ఈ పెళ్లి నాకు ఇష్టంలేదు. నిన్ను పెళ్లిచేసుకోని ఈ బతుకు ముళ్లకంప. నీ పాదసేవ చేసుకోని ఈ జీవితం వ్యర్థం. నన్ను తీసుకుపో. ఎక్కడికైనా పోదాం. ఏదైనా చేసుకొని బతుకుదాం. లేకపోతే స్లీపింగ్ పిల్స్ (నిద్ర మాత్రలు) మింగి చచ్చిపోతాను' అని వ్రాసింది అరుణ.

( ఇదొక ముఖ్యమైన మార్పు. పూర్వకాలంలో అయితే గన్నేరుపప్పు, నూనె మింగి చచ్చిపోయేవాళ్ళు.)

ఇది జీవితానికి సంబంధించిన సమస్య. త్వరపడి నిర్ణయించడానికి వీలులేదు. ఆలస్యం చేయడానికి వీలులేదు. ఆలోచనలో పడ్డాను.

నా ఆలోచన ఇంకా తెగలేదు. ముహూర్తం దగ్గర పడింది. పెళ్లివారు తరలి వచ్చారు. నేను ఇంక ఏదో ఒకటి తెగించి చేయాలనుకున్నాను.




చిత్రకళా ప్రదర్శనశాలలో మోడర్న్ ఆర్ట్‌పై మోజుగల ఓ పెద్దమనిషి తదేకంగా ప్రతి చిత్రం నైపూ చూసి, ప్రతి చిత్రం విలవ కనుక్కుంటూ వెడుతుంటే, ఒక చోట క్యూబిక్ స్టైల్‌లో ఉన్న మోడర్న్ ఆర్ట్ చూసి ఆగి, "విలవ ఎంతుంటుంది?" అన్నాడు, స్పెక్ట్సు చేతిలోకి తీసుకొని అద్దాల్ని పంచతో తుడుస్తూ.

"అయ్యా! అది మోడరన్ ఆర్ట్ కాదు. అది మీటర్ బోర్డు. అవన్నీ స్విచెస్" అన్నాడు అక్కడున్న ఆయన.

"ఏమిటీ!" అంటూ కళ్లజోడెట్టుకొని దానికి దగ్గరగా వెళ్లి, "ఇంపాసిబుల్!" అన్నాడు ఆ పెద్దమనిషి ఆశ్చర్యంగా.

అంతలో ఒక విచిత్రం జరిగింది.

విలన్ — వాడే పెళ్లికొడుకు— సిగరెట్లు అయిపోయాయి కాబోలు, (నాకు అలాంటి చెడు అలవాట్లు ఏమీ లేవు. ముక్కుపొడుం మాత్రం పీలుస్తాను. దానికి సభా పూజ్యత ఉందికదా, మరి?) సిగరెట్లు కొనడానికి బజారుకి బయలుదేరాడు. రోడ్డుమీద కాలుపెట్టేసరికి ఒక లారీ గుద్దేసింది. (పూర్వ కాలంలో ఇలాంటి సదుపాయాలు లేవు.) పెళ్లికొడుక్కి చావు తప్పి కన్ను లొట్టపోయింది. పెళ్లివారికి కోపం వచ్చింది. 'ఈ పెళ్లి జరగడానికి వీలులేదు, మేం పోతున్నాం' అన్నారు. వెళ్లిపోయారు.

అరుణా వాళ్ల నాన్న — ముందు చెప్పానో లేదో— మహా మొండివాడు. అనుకున్న ముహూర్తానికి పెళ్లి జరిగి తీరా లన్నాడు.

పి. యు. సి. కూడా పాసుకాలేని చవటని నాకు అరుణ నిచ్చి పెళ్లి చేస్తానని భీష్మించుకు కూర్చున్నాడు.

సరిగా అంతకుముందే నేను అరుణని లేవదీసుకుని పోవడానికి నిశ్చయించుకుని ఉన్నాను. (ఇది కూడా ఒక మార్పే. పూర్వకాలంలో ఇలాంటి నిర్ణయాలు జరపడానికి నాలాంటి కుర్రవాళ్లు ఒకపట్టాన సాహసించేవారు కారు.)

అరుణా వాళ్ల నాన్న కోరగా మా తలిదండ్రులు అంగీకరించారు. అందుకని అరుణా, నేనూ లేచిపోవలసిన అవసరం లేకుండా పోయింది. మా పెళ్లి అయింది, నిర్విఘ్నంగా.

ముందు చెప్పే ఉంటాను — అరుణా వాళ్ల నాన్న ఎవరో కాదు. సాక్షాత్తూ నా మేనమామే. మా అమ్మ అన్నయ్య.

అయితే అరుణా, నేనూ పి. యు. సి. లోకి వచ్చేవరకు ఒకరి నొకరు ప్రేమించుకోలేదు. ప్రేమించడానికి తగిన అర్హత, యోగ్యత మాకు పి. యు. సి. లోనే లభించాయి. (కాలం కూడా మారిందనడానికి ఇదొక తార్కాణం. పూర్వం పి. యు. సి. ఉండేది కాదు. అందుచేత ఇలాంటి పవిత్ర ప్రేమగాథలకు ఆస్కారం ఉండేది కాదు.)

తీరా పెళ్లి అయిన తరవాత రాక్షసుడి లాంటి మా మావయ్య దేవుడై పోయాడు. చచ్చిపోయాడు. మావయ్య ఏకైక కుమార్తె అరుణ మావయ్య ఆస్తికి వారసురాలు అయింది. నేను ఇల్లరికపు అల్లుణ్ణి అయ్యాను.

ఎంతైనా మావయ్య కూతురుకదా? మావయ్య గుణాలు అరుణకి సంక్రమించాయి. లేకపోతే మావయ్య చచ్చిపోయి అరుణని ఆవహించి ఉంటాడు.

నేను ప్రేమికులుగా ఉన్న పుణ్యకాలంలో ఉండే అరుణ కా దిప్పుడు. పి. యు. సి. కూడా పాసుకాని చవటనని, తనమీద ఆధారపడి బతుకుతున్నానని, అదని ఇదని నన్ను ఈసడించడం ప్రారంభించింది.

నా జీవిత నౌక తలకిందులైంది. జీవితం మీద విరక్తి పుట్టింది. ప్రేమ టూస్యవెన్సు వైవాహిక జీవితం మీద రోత పుట్టింది. చచ్చిపోదా మనుకున్నాను. చచ్చిపోవడానికి ఉత్తమమైన మార్గం అన్వేషించడానికి పూనుకున్నాను. నా ఆలోచన ఇంకా తెగలేదు. ఈపాటికి గ్రహించే ఉంటారు — నేను త్వరపడి నిర్ణయాలు జరిపే మనిషిని కానని.

అంతలో మరొక విచిత్రం జరిగింది.

డి. ఎస్. కె. ప్రభుత్వం ప్రారంభించిన లాటరీ మొదటి బహుమతి— అక్షరాలా ఒక లక్ష రూపాయలు — లభించింది. రాత్రి భిక్షాధికారిని. తెల్లవారే సరికి లక్షాధికారిని. (మనుషులు మారారు అనడానికి ఇదొక గొప్ప నిదర్శనం. పూర్వం కాంగ్రెసు వారు మద్రాసును పాలించిన కాలంలో ఇలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. డి. ఎస్. కె. వారి ధర్మమా అని నాలాంటి అభాగ్యు లెందరో భాగ్యవంతులు అవుతున్నారు.)

లాటరీలో నేను గెలిచిన సంగతి తెలిసేసరికి అరుణ తిరిగి నా మీద వెనకటి ప్రేమ అంతా ఒలకబోయ సాగింది. నన్ను అత్తవారికి అప్పగించి చేతులు కడుక్కున్న నా తల్లిదండ్రులు తిరిగి నన్ను కౌగలించుకున్నారు. అంటే మనుషులు మారారన్న మాటే కదా?

నేనూ ఈలోగా మారాను కాబోలు. అరుణమీద ఎంత ప్రేమ ఉన్నా కొంత కాలం ఒక నాటకం ఆడాలనుకున్నాను. పైగా, విరిగిన అద్దంలాంటి నా మనసు ఇంకా పూర్తిగా అతుక్కోలేదు. దాన్ని అతుకు కనిపించకుండా అతికించడానికి డబ్బు అనే జిగురు అవసరం.

విజయవాడనుంచి విమానంలో మద్రాసు — హైదరాబాదు మీదుగా— చేరుకున్నాను. స్వయంగా కే. కే. శ్రీ అన్నాదురై చేతుల్లో మంచి బహుమతి అందుకున్నాను. (అప్పటికి ఆయన ఇంకా కీర్తి శేషించిన వారు కాలేదు.)

స్వల్పకాల వియోగం ప్రేమకు మంచిదని తోచింది. మద్రాసులో విమానం ఎక్కి, బొంబాయి మీదుగా బెయిరూట్ బయలుదేరాను. కొంత ప్రపంచం చూసి విజ్ఞానం సంపాదిద్దామని సంకల్పించాను. బెయిరూట్‌కు, విజ్ఞానానికి సంబంధం ఏమిటో నాకు తెలియదు. కాని, ఆ పేరు బాగుంది. అందుకని అక్కడికి బయలుదేరాను.

బొంబాయిలో ఒక అందమైన అమ్మాయి విమానం ఎక్కింది. అరుణ కంటె కూడా అందంగా ఉంది. ప్రేమిద్దామని అనిపించింది, నిజానికి. 'ప్రేమించిన పిల్లని పెళ్లి చేసుకొన్న తరవాత మరొక పిల్లని ప్రేమించడంలో తప్పేమిటి?' అనిపించింది. మారే కాలానికి అనుగుణంగా మారుతున్న మగవాడు ఏకాధిక స్త్రీ ప్రేమకు ఎందుకు పాత్రుడు కాకూడదనిపించింది. ఆలోచనలో పడ్డాను. అంతలో బెయిరూట్ చేరింది విమానం.


మరి ఏమైందో అరుణకన్న అందమైన ఆ అమ్మాయి ఆకస్మికంగా అంతర్ధానం అయింది. ఆమెతోబాటు నా చేతిసంచి కూడా మాయమైంది.

ఆ విధంగా బెయిరూట్‌లో చిక్కుపడిపోయాను.

మనిషి మారకుండా ఉంటె ఇలాటిది సాధ్యమై ఉండేది కాదని నొంటూ పథంగా చెప్పగలను.

'వి' ఫారమ్ సంపాదించడానికి నేను ఏమి చేశానో, బెయిరూట్‌లో ఏమైందో, ఈలోగా నా అసలు ప్రేయసి అరుణ ఏమయిందో, ఆ అరుణ కంటె అందమైన ఆ అమ్మాయి ఎవరో అంతా మరొకసారి ఎప్పుడైనా చెబుతాను. సెలవు.

— కె.




థర్డ్ క్లాస్ కంపార్టుమెంటులో జనం కిక్కిరిసి ఉన్నారు. కార్నర్ సీట్లో కునుకు తీస్తున్న పెద్ద మనిషిని పసిగట్టాడు పిక్‌పాకెట్ రంగన్న ...

నెమ్మదిగా కాళ్లను, పిపుళ్ళని, జేబుల్ని దాటుకొని ఆ పెద్ద మనిషి దగ్గరి కెళ్లి చోటు చేసుకుని గర్భవతిలా నిండుగా ఉన్న జేబుకేసి చూస్తూ గుటకలు మింగుతున్నాడు.

జేబుకి రంగన్న వేళ్లు తగలగానే కునుకుతీసే పెద్దమనిషి కనిపెట్టాడు. తను గాఢనిద్రలో ఉన్నట్లు నటించాడు.

రంగన్న ఎప్పుడో జేబు కొట్టేసి పక్క స్టేషనురాగానే దిగిపోయాడు. ఆ పెద్దమనిషికూడా అవులిస్తూనే రంగన్న వెంటే దిగి ప్లాటుఫారంలో రంగన్నని పిలిచి ...

"బాబ్బీ! ఆ పాకెట్‌లోని పైకం నీవు తీసేసుకొని, దయచేసి ఆ ఖాళీ పాకెట్ నా కిచ్చెయ్, నాయనా! అది నా పెళ్లినాడు కొనుక్కున్నాను... జ్ఞాపకానికైనా ఉంటుంది" అన్నాడు.

నీరైపోయిన రంగన్న పాకెట్‌తీసి చూస్తే చిల్లిగవ్వ లేదు.

ఆముదం తాగిన మొహంతో, "క్షమించండి!" అంటూ పాకెట్ పెద్దమనిషి చేతుల్లో పెట్టి, "ఇవి చేతులుకావు కాళ్లనుకోండి" అనేసి మరీ కనిపించకుండా పారిపోయాడు.